చర్లలో మావోయిస్టుల డంప్ స్వాధీనం

- 280 బీజీఎల్ మిల్స్ స్వాధీనం
- లొంగిపోయిన మావోయిస్టు సమాచారంతో పోలీసుల గాలింపు



6 లో...

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం | 18 | నవంబర్ | 2026 ◆ పేజీలు : 8





సింగిరెడ్డిపల్లిలో గోదారమ్మ గర్భఘోష

- జానంపేటలో ఇసుక తవ్వకాల దందా!
- ఒక పంచాయతీ పేరుతో ర్యాంపు అనుమతులు.. మరో రెవెన్యూ పరిధిలో తవ్వకాలు!
- సింగిరెడ్డిపల్లికి మాత్రమే పర్మిషన్.. జానంపేట పరిధిలో ఇసుక తవ్వకాలపై అనుమానాలు!
- భూపతిరావుపేటలో డంపింగ్.. జానంపేట మీదుగా రవాణా?
- సాసైటీల ముసుగులో తెరవెనుక రాజకీయ, వ్యాపార పెత్తనమా?
- మైనింగ్, రెవెన్యూ శాఖలు స్పందించేదెప్పుడు? క్షేత్రస్థాయి విచారణకు ప్రజల డిమాండ్

పినపాక, నవంబర్ 17 (ప్రజాజ్యోతి): గోదావరి నది ఇసుక సంపదపై అక్రమార్కుల కన్ను పడిందా? గిరిజన సొసైటీలకు జీవనోపాధి కల్పించాల్సిన ఇసుక ర్యాంపులు కొందరి వ్యాపార ప్రయోజనాలకు వేదికలుగా మారుతున్నాయా? పినపాక మండల పరిధిలోని సింగిరెడ్డిపల్లి ఇసుక ర్యాంపు వ్యవహారం ఇప్పుడు పలు అనుమానాలకు తావిస్తోంది. ఒక పంచాయతీ పేరుతో ప్రభుత్వ అనుమతులు పొందుతూ, మరో రెవెన్యూ పరిధిలో ఇసుక తవ్వకాలు చేపడుతున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశమవుతున్నాయి. అనుమతులు ఒకచోట.. తవ్వకాలు మరోచోట.. ఇసుక నిల్వలు ఇంకోచోట అన్నట్లుగా సాగుతున్న ఈ వ్యవహారంపై సంబంధిత శాఖల అధికారులు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

అనుమతులు సింగిరెడ్డిపల్లికి.. తవ్వకాలు జానంపేటలోనా?

సింగిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఇసుక ర్యాంపు నిర్వహణకు మాత్రమే ప్రభుత్వ అనుమతులు జారీ అయినట్లు సమాచారం. అయితే వాస్తవంగా ఇసుక తవ్వకాలు మాత్రం జానంపేట రెవెన్యూ పరిధిలో జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ర్యాంపునకు అనుమతి ఇచ్చిన ప్రాంతం ఒకటి కాగా, ఇసుకను వెలికితీస్తున్న ప్రాంతం మరొకటి కావడం

మిగతా 2 లో...

జపాన్ లో జిల్లా కలెక్టర్ అంకిత్



- జపాన్ అభివృద్ధి నమూనాల అధ్యయనంతో కొత్తగూడెం జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి
- విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశుద్ధ్యం, అభివృద్ధిలో జపాన్ అనుసరిస్తున్న ఉత్తమ విధానాలపై అధ్యయనం

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 18, (ప్రజాజ్యోతి) కొత్తగూడెం జిల్లాలోని వెనుకబడిన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి దోహదపడేలా జపాన్ లో అమలవుతున్న అభివృద్ధి నమూనాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సమర్థవంతమైన పరిపాలనా విధానాలను జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యయనం చేస్తున్నారు.నీతి ఆయోగ్, జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్ అండ్ బ్లాక్స్ కార్యక్రమంలో భాగంగా నవంబర్ 15 నుంచి 21 వరకు జపాన్ లో నిర్వహిస్తున్న అధ్యయన పర్యటనలో జిల్లా కలెక్టర్ పాల్గొంటున్నారు.ఈ పర్యటనలో భాగంగా జపాన్ లో అమలవుతున్న ఆధునిక అభివృద్ధి విధానాలు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, సమర్థవంతమైన

మిగతా 2 లో...

కన్న కొడుకు చేతిలోనే తండ్రి హత్య

- పరారీలో ఉన్న నిందితుడు అరెస్ట్
- భూమి డబ్బుల కోసం 84 ఏళ్ల తండ్రిపై ఇనుప రాడ్డుతో దాడి
- భద్రాచలం నుంచి వరంగల్ ఎంజీఎం వరకు.. 8 రోజులు మృత్యువుతో పోరాడి మృతి
- చినబండిరేవు హత్య కేసులో పర్ణశాలలో దొరికిన ధనుంజయ్
- అన్న ఫిర్యాదుతో కేసు నమోదు.. 15 రోజుల జ్యుడీషియల్ రిమాండ్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / భద్రాచలం, నవంబర్ 17, ప్రజాజ్యోతి డబ్బు కోసం కన్న తండ్రినే చంపేశాడు..! భూమి వాటా డబ్బుల విషయంలో వచ్చిన గొడవ, 84 ఏళ్ల వృద్ధుడి ప్రాణం తీసింది. ఘటన జరిగినప్పటి నుంచి పరారీలో ఉన్న కుమారుడిని దుమ్ముగూడెం పోలీసులు ఎట్టకేలకు పర్ణశాలలో అదుపులోకి తీసుకున్నారు. దుమ్ముగూడెం మండలం చినబండిరేవు గ్రామానికి చెందిన మేకల తాతయ్య (84) హత్య కేసులో నిందితుడు మేకల ధనుంజయ్ (45)ను అరెస్ట్ చేసినట్టు భద్రాచలం డీఎస్పీ కార్యాలయం తెలిపింది. నిందితుడిని భద్రాచలంలోని

మిగతా 2 లో...

యువకుడిపై ప్రైవేట్ లాడ్జి యాజమాన్యం దాడి

- దాడిలో గాయపడ్డ తెల్లం శరత్ అక్కడ కక్కడే మృతి
- నేరస్థుడని కలినంగా శిక్షించాలి, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి
- సత్యసాయి లాడ్జి ఎదుట ఆదివాసి జేఏసీ సంఘాల నిరసనలు



భద్రాచలం, నవంబర్ 17 (ప్రజాజ్యోతి): భద్రాచలం రామాలయం సమీపంలోని సత్యసాయి లాడ్జి వద్ద సోమవారం రాత్రి ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో తెల్లం శరత్ (23), అనే యువకుడు మృతి చెందినట్లు సమాచారం. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం : తొట్టిపంపుల గ్రామం, అన్నపురెడ్డిపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చెందిన తెల్లం శరత్ భద్రాచలంలోని జోమోట, స్విగ్గి అనే ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో శరత్ స్నేహితులు

మిగతా 2 లో...

జపాన్ లో జిల్లా కలెక్టర్ అంకిత్



(మొదటి పేజీ తరువాయి...)

పరిపాలనా పద్ధతులు, ప్రజా సేవల నిర్వహణ, పారిశుధ్యం, మౌలిక సదుపాయాల కల్పన, స్థానిక సంస్థల పనితీరు తదితర అంశాలను పరిశీలించి అధ్యయనం చేస్తున్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు జపాన్ అనుసరిస్తున్న వినూత్న విధానాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరుపై అవగాహన పొందుతున్నారు.జిల్లాలోని ఆస్పిరేషనల్ బ్లాక్ తో పాటు ఇతర వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని విద్య, వైద్యం, పోషకాహారం, వ్యవసాయం, తాగునీరు, పారిశుధ్యం, మౌలిక సదుపాయాల రంగాల్లో జపాన్ అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను జిల్లాలో అమలు చేసేందుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నారు.ఈ అధ్యయన పర్యటన ద్వారా పొందిన అనుభవాలు, పరిజ్ఞానం, ఉత్తమ అభివృద్ధి విధానాలను జిల్లాలోని స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అన్వయించి, అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించే దిశగా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టనుంది.

కన్న కొడుకు చేతిలోనే తండ్రి హత్య

(మొదటి పేజీ తరువాయి...)

అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా..కోర్టు 15 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం.. భూమి వాటాకు సంబంధించిన డబ్బుల విషయంలో తండ్రితో ధనుంజయ్ కు వివాదం నెలకొంది. ఈ నేపథ్యం లో 2 తేదీన రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో ధనుంజయ్ తన తండ్రి తలపై ఇనుప రాడ్డుతో కొట్టినట్టు తెలిసింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన తాతయ్యకు తొలుత భద్రాచలంలో చికిత్స అందించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ 8 రోజుల పాటు మృత్యువుతో పోరాడిన తాతయ్య.. 10వ తేదీన చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనపై మృతుడి పెద్ద కుమారుడు మేకల వీరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు 10వ తేదీన దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా బీఎన్ఎస్ యాక్ట్ కింద హత్యకేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలించిన పోలీసులు..పర్ణశాలలో అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

సింగిరెడ్డిపల్లిలో గోదారమ్మ గర్భఘోష





(మొదటి పేజీ తరువాయి...)

పలు సందేహాలకు తావిస్తోంది. ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న సరిహద్దులు, తవ్వకాలకు అనుమతించిన భౌగోళిక ప్రాంతం, వాస్తవంగా తవ్వకాలు జరుగుతున్న ప్రదేశం ఒకటేనా? కాదా? అన్నది అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది. సింగిరెడ్డిపల్లి పంచాయతీకి మాత్రమే అనుమతి ఉన్నప్పుడు జానంపేట రెవెన్యూ పరిధిలో తవ్వకాలు ఎలా జరుగుతున్నాయి? వాటికి ప్రత్యేక అనుమతులు ఉన్నాయా? లేక అనుమతుల పరిధిని దాటి కార్యకలాపాలు సాగుతున్నాయా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఒకచోట ర్యాంపు.. మరోచోట డంపింగ్!

సింగిరెడ్డిపల్లి పేరుతో ర్యాంపునకు అనుమతులు పొందినప్పటికీ, అక్కడి నుంచి ఇసుక తరలింపునకు మార్గం లేకపోవడంతో భూపతిరావుపేట వద్ద ఇసుక నిల్వలు ఏర్పాటు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అక్కడి నుంచి జానంపేట మీదుగా ఇసుక వాహనాలు రాకపోకలు సాగిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అసలు భూపతిరావుపేట వద్ద డంపింగ్ కు అనుమతులు ఉన్నాయా? ఆ భూమి వినియోగానికి రెవెన్యూ శాఖ నుంచి అనుమతి తీసుకున్నారా? ర్యాంపు అనుమతుల్లో ఈ నిల్వ ప్రాంతాన్ని పేర్కొన్నారా? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. అనుమతులు ఒక ప్రాంతానికి ఉండి, ఇసుక నిల్వలు మరో ప్రాంతం లో ఏర్పాటు చేస్తే దానికి సంబంధించిన నిబంధనలు ఏమిటన్నది అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

గోదారమ్మ గర్భాన్ని గుల్ల చేస్తున్నారా?

ఇసుక తవ్వకాల వల్ల గోదావరి నది సహజ స్వరూపానికి నష్టం వాటిల్లుతోందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అనుమతించిన పరిమాణంలోనే తవ్వకాలు జరుగుతున్నాయా? నదీ గర్భంలో తవ్వకాల లోతు ఎంత? విస్తీర్ణం ఎంత? యంత్రాల వినియోగం, పర్యావరణ నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాలు పాటిస్తున్నారా? అనే అంశాలపై శాస్త్రీయంగా పరిశీలన జరగాలి. నది సహజ ప్రవాహానికి, పరిసర ప్రాంతాల భూగర్భ జలాలకు, తీరప్రాంత గ్రామాలకు తవ్వకాల వల్ల ఎలాంటి ప్రభావం పడుతోందో అధికారులు అధ్యయనం చేయాలి. ప్రకృతి సంపదను కాపాడాల్సిన బాధ్యతను విస్మరించి వ్యాపార కార్యకలాపాలకే ప్రాధాన్యం ఇస్తే భవిష్యత్తులో పర్యావరణ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సొసైటీల ముసుగులో తెరవెనుక పెత్తనమా?

గిరిజన, మత్స్యకార సొసైటీలకు కేటాయించిన ఇసుక ర్యాంపుల ద్వారా ఆయా సొసైటీ సభ్యులకు ఆర్థికంగా లబ్ధి చేకూరాలి. కానీ వాస్తవంగా ఇసుక వ్యాపారంలో పెట్టుబడులు ఎవరివి? యంత్రాలు ఎవరివి? రవాణా, విక్రయాల నిర్వహణ ఎవరి చేతుల్లో ఉంది? సొసైటీ సభ్యులకు కేవలం కూలీ డబ్బులే అందుతున్నాయా? కోట్ల వ్యాపారంలో వచ్చే ఆదాయం, లాభాలు ఎవరికి వెళ్తున్నాయి? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. భూపతిరావుపేట ఇసుక డంపింగ్ వ్యవహారంలో అధికారులు నిష్పక్షపాతంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తుల వివరణ తీసుకోవడంతో పాటు సొసైటీల రికార్డులు, ఆర్థిక లావాదేవీలను పరిశీలించిన ప్పుడే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

జానంపేట మీదుగా రవాణా.. పత్రాలు ఉన్నాయా?

భూపతిరావుపేట వద్ద నిల్వ చేసిన ఇసుకను జానంపేట మీదుగా తరలిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో రవాణా వ్యవస్థపై కూడా అధికారులు దృష్టి సారించాలి. ఇసుక వాహనాలకు అవసరమైన రవాణా పత్రాలు ఉన్నాయా? తరలిస్తున్న ఇసుక పరిమాణం ప్రభుత్వ రికార్డులతో సరిపోతుందా? వాహనాల రాకపోకలకు అనుమతించిన మార్గం ఏది? రవాణా సమయంలో నిబంధనలు పాటిస్తున్నారా? డంపింగ్ ప్రాంతానికి సంబంధించి భూమి యజమానుల అనుమతులు, రెవెన్యూ శాఖ అనుమతులు ఉన్నాయా? అనే విషయాలను తనిఖీ చేయాల్సి ఉంది.

అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు?

ర్యాంపునకు అనుమతులు ఒక పంచాయతీ పేరుతో ఉండగా, తవ్వకాలు మరో రెవెన్యూ పరిధిలో జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నప్పటికీ మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టకపోవడంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ అనుమతుల పరిధి ఎక్కడి వరకు ఉంది? వాస్తవంగా తవ్వకాలు జరుగుతున్న ప్రదేశం ఏ సర్వే నంబర్లలో ఉంది? అనుమతించిన విస్తీర్ణం ఎంత? తవ్విన ఇసుక పరిమాణం ఎంత? డంపింగ్ కు, రవాణాకు ప్రత్యేక అనుమతులు ఉన్నాయా? అన్న వివరాలను ప్రజలకు వెల్లడించాలని కోరుతున్నారు.

సమగ్ర విచారణతోనే వాస్తవాలు వెలుగులోకి!

సింగిరెడ్డిపల్లి ర్యాంపునకు జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులు, అనుమతించిన తవ్వకాల ప్రాంతం, జానంపేట రెవెన్యూ పరిధిలో జరుగుతున్న తవ్వకాల స్థానం, భూపతిరావుపేటలో ఏర్పాటు చేసిన ఇసుక డంపింగ్ ప్రాంతం, జానంపేట మీదుగా జరుగుతున్న రవాణా మార్గం, వాహనాల రవాణా పత్రాలు, సొసైటీల ఆర్థిక లావాదేవీలపై మైనింగ్, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే భూమి సర్వే, జీపీఎస్ ఆధారిత క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి అనుమతుల పరిధిని, వాస్తవ తవ్వకాల ప్రాంతాన్ని నిర్ధారించాలని కోరుతున్నారు.

గోదావరి ఇసుక సంపద ప్రజల సహజ వనరు. గిరిజన సొసైటీల అభివృద్ధి పేరుతో ఇతరుల వ్యాపార ప్రయోజనాలు నెరవేరుతున్నాయా? సింగిరెడ్డిపల్లి పేరుతో అనుమతులు పొంది జానంపేట రెవెన్యూ పరిధిలో తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణల్లో వాస్తవమెంత? భూపతిరావుపేట డంపింగ్ కు అనుమతులు ఉన్నాయా? అన్న ప్రశ్నలకు అధికారుల విచారణతోనే సమాధానం లభించనుంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, అక్రమాలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

యువకుడిపై ప్రైవేట్ లాడ్జి యాజమాన్యం దాడి

(మొదటి పేజీ తరువాయి...)

దూర ప్రాంతం నుండి భద్రాచలం వస్తున్నందున, ప్రైవేట్ లాడ్జిలో రూమ్ కావాలి అని శరత్ నీ కోరగా అతని ఇద్దరి స్నేహితుల కార్తిక్, ప్రశాంత్ లతో కలిసి సోమవారం రాత్రి రామాలయం సమీపంలోని 100 గదుల సత్రం ఎదురుగా ఉన్న సత్య సాయి అనే ప్రైవేట్ లాడ్జి వద్దకు వెళ్ళారు. ఈ క్రమంలో ఆధార్ కార్డు వద్ద లాడ్జి యజమాని మణికంఠ తో తెల్లం శరత్ కి వాగ్వాదం జరిగినట్లు తెలుస్తుంది. ఈ నైపద్యంలో లాడ్జి యజమాని అందులో పని చేస్తున్నటువంటి వినయ్ కి ఫోన్ చేసి సమాచారం తెలపగా అక్కడికి చేరుకున్న వినయ్ , యజమాని మణికంఠ ఇద్దరు కలిసి తెల్లం శరత్, అతని స్నేహితుల పై దాడి చేసినట్లు తెలుస్తోంది. ఈ దాడిలో లాడ్జిలో పనిచేస్తున్నటువంటి వినయ్ ఆగ్రహంతో శరత్ మెడ మీద పిడిగుద్దులు గుద్దడంతో శరత్ సృహ కోల్పోయాడు. మరోవైపు శరత్ తో ఉన్న స్నేహితులు సైతం దాడిలో భయభ్రాంతులకు గురై పరారయ్యారు. సృహ



కోల్పోయిన శరత్ నీ స్థానికుల సహకారంతో వినయ్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. మరణ వార్త వినగానే వినయ్ అక్కడి నుండి పారారవ్వగా... పోలీసులు గాలించి పట్టుకున్నట్లు తెలుస్తుంది. అదేవిధంగా లాడ్జి యజమాని



మణికంఠ సైతం పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. కాగా మృతుడు తల్లిదండ్రుల ఫిర్యాదుతో భద్రాచలం పట్టణ సీఐ సట్ల రాజు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

సత్యసాయి లాడ్జి ఎదుట ఆదివాసి జేఏసీ సంఘాల నిరసనలు – మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ డిమాండ్

తెల్లం శరత్ మృతితో భద్రాచలం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. మంగళవారం ఉదయం నుండి ఆదివాసి సంఘాలు ఒక్కొక్కరిగా భద్రాచలం చేరుకొని నిరసన తెలిపారు. ఆసుపత్రికి చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్కు వెళ్లి నిందితులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఆదివాసి గిరిజన సంఘ నాయకులు ప్రైవేట్ లాడ్జి వద్ద మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ నిరసన తెలిపారు. అక్కడ నుంచి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి చేరుకుని ఐటిడిపిఓ, ఎమ్మెల్యే రావాలి, బాధిత కుటుంబానికి భరోసా కల్పించాలంటూ నిరసన తెలిపారు. ఈ నిరసనలో కుంజ ధర్మ, పాయం రవి వర్మ, మూర్ల రమేష్, కుంజా శ్రీను, కుంజా సంతోష్, గుండు శరత్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

బ్రైట్ మైండ్స్ ప్లే స్కూల్ లో వివాదం

- తోటి విద్యార్థి వీపుపై కొరికాడని పేరెంట్ ఆరోపణ
- అడిగితే టీచర్లు నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ఫిర్యాదు
- పిల్లలను పట్టించుకోవడం లేదని పేరెంట్ ఆందోళన
- ఆ విషయం తమకు తెలియదన్న ప్రిన్సిపాల్.. రాజమండ్రిలో ఉన్నానని ప్రజాజ్యోతికి వివరణ
- టీచర్ల ముందు పేరెంట్ అనుచితంగా మాట్లాడారని ప్రిన్సిపాల్ ఆరోపణ





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు, నవంబర్ 17, ప్రజాజ్యోతి

మణుగూరు సుందరయ్య నగర్ లోని బ్రైట్ మైండ్స్ ప్లేస్కూల్ లో చిన్నారిని మరో చిన్నారి వీపుపై కొరికిన సంఘటన మణుగూరులో చర్చనీయాంశమైంది. ఓ పేరెంట్ తెలిపిన వివరాల ప్రకారం.. స్కూల్ లో ఆడుకుంటున్న సమయంలో తోటి విద్యార్థి తమ పిల్లవాడిని వీపుపై కొరికాడని, దీంతో వీపుపై పళ్ల గుర్తులు ఏర్పడ్డాయని చెప్పారు. ఈ విషయంపై స్కూల్ కు వెళ్లి టీచర్లను అడిగితే.. "అలా జరిగితే మేమేం చేయాలి" అన్నట్లు సమాధానం ఇచ్చారని, పిల్లలను వదిలేసి తమ పనులు చేసుకుంటున్నారని పేరెంట్ ఆరోపించారు. ఈ విషయాన్ని టీచర్లు తేలికగా తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ప్రజాజ్యోతి స్కూల్ ప్రిన్సిపాల్ వివరణ కోరగా.. ఆ విషయం తమకు తెలియదని, ఆసుపత్రి పని మీద రాజమండ్రి వెళ్లినట్లు తెలిపారు. పేరెంట్ కూడా స్కూల్ కు వచ్చి టీచర్ల ముందు అనుచిత రీతిలో మాట్లాడారని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రతి పిల్లవాడిపై టీచర్ల కేరింగ్ ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఏది ఏమైనా ప్లే స్కూల్ లో చిన్న పిల్లల భద్రత విషయంలో మరింత జాగ్రత్త తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని తల్లిదండ్రులు స్కూల్ యాజమాన్యాన్ని కోరుతున్నారు.

తెల్లం శేఖర్ హత్య చేసినంతకులను కఠినంగా శిక్షించాలి



గుండాల నవంబర్ 17 ప్రజా జ్యోతి ఆదివాసి యువకుడు తెల్లం శేఖర్ ను హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని తుడుం దెబ్బ జాతీయ ఉపాధ్యక్షులు కొడెం వెంకటేశ్వర్లు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు వాగబోయిన చంద్రయ్య దొరలు డిమాండ్ చేశారు. మంగళవారం గుండాల మండల కేంద్రంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షులు పూణెం రమణ బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. భద్రాచలం పూర్తిగా వలస వాదుల ప్రాంతంగా ఉందని, ఆంధ్రప్రదేశ్ నుండి వలసవాదులు వస్తూ ఉన్నారని దీని అరికట్టాలని డిమాండ్ చేశారు. వలసవాదుల చేతిలో అమాయక గిరిజనులు బలవుతున్నారని హత్య చేసిన అంతకుమి శిక్షిస్తూ వారి కుటుంబాన్ని భద్రాచలం నుండి పంపించాలని డిమాండ్ చేశారు ఆదివాసి సంఘాలను ఐక్యం చేసి ఆందోళన చేస్తామని వారన్నారు ఈ కార్యక్రమంలో గొగ్గల సుధాకర్, జబ్బా సుదర్శన్, ప్రతాప్, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

హామీలు ఏమయ్యాయి..? కాంగ్రెస్ కు బీఆర్ఎస్ సూటి ప్రశ్న..!

- ఆరు గ్యారెంటీలు.. 420 హామీలు.. మూడేళ్లయినా అతీగతీ లేదు
- రాహుల్ మణుగూరు సభలో ఇచ్చిన మాటలు ఏమయ్యాయి..?
- ప్రజా సమస్యలు వదిలేసి.. కాళేశ్వరంపై బురద చల్లుతున్నారు
- రైతును వదిలేసిన సర్కార్.. సాగునీటికి దిక్కు లేదు
- హామీలు నెరవేర్చే వరకు వీధి పోరాటమేనన్న బీఆర్ఎస్ పార్టీ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు, నవంబర్ 17, ప్రజాజ్యోతి ఎన్నికలప్పుడు ఒక మాట..అధికారంలోకి వచ్చాక మరో మాట..! ఇచ్చారని ఇదే ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ తీరని మణుగూరులో బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. హామీల పేరుతో ఓట్లు దండుకుని, గద్దెనెక్కాక ప్రజలను గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు మంగళవారం మణుగూరు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ప్రెస్ మీట్ సమావేశంలో పార్టీ నాయకులు కుర్రి నాగేశ్వరరావు, పోషం నరసింహారావు మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు చెప్పి ప్రజలను నమ్మించిన కాంగ్రెస్.. మూడేళ్ల పాలనలో ఒక్క హామీని కూడా పూర్తిగా నెరవేర్చలేదని ఆరోపించారు. అధికారంలోకి రావడానికి ముందు ప్రతి సభలో నూ హామీల వర్షం కురిపించారని, తీరా అధికారంలోకి వచ్చాక వాటి ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. 2023 నవంబర్ 15న మణుగూరు అంబేద్కర్ సెంటర్ లో రాహుల్ గాంధీ నిర్వహించిన భారీ బహిరంగ సభను గుర్తు చేశారు. ఆ సభలో రాహుల్ ఇచ్చిన హామీలతో పాటు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటలను కూడా ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించలేని సర్కార్ ను వారు "దద్దమ్మ ప్రభుత్వం" గా అభివర్ణించారు.

›» కేసీఆర్ ప్రభుత్వంలో ప్రజలకు నీటి కష్టాలు లేవు...

కేసీఆర్ హయాంలో వర్షపు నీటిని ఒడిసిపట్టి చెరువులు, చెక్ డ్యాంలు, కుంటలు కట్టారని, మిషన్ భగీరథ, సాగునీటి ప్రాజెక్టులతో రైతుకు, ప్రజలకు నీటి కష్టం లేకుండా చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు రైతు అనేక సమస్యలతో సతమతమవుతున్నా పట్టించుకునే నాథుడే లేడని అన్నారు. బీఆర్ఎస్ ను బదనాం చేయడానికే కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని మండిపడ్డారు. హామీలు అమలు చేసే వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటాలు ఆగవని స్పష్టం చేశారు. విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు, రైతులు, కార్మికులు, అన్ని కులాలు, మతాల ప్రజలు రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ వైఫల్యాలపై గళం విప్పాలని పిలుపునిచ్చారు. ప్రజలకు బీఆర్ఎస్ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో నాయకులు ఎడ్ల శ్రీను, అక్కి నర్సింహారావు, జావీద్ పాషా, వీరన్న, చిన్నకేశవులు, బోశెట్టి రవి, తురక రాంకోటి, ఆవుల శ్రీను, రామారావు, ఖమ్మంపాటి శ్రీను, వేల్పుల నరేష్, ఆవుల నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.



తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వద్దు

► ఆదివాసి సంక్షేమ పరిషత్



గుండాల నవంబర్ 17 ప్రజా జ్యోతి తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వద్దంటూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. మంగళవారం ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తాసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా ర్యాలీని ఉద్దేశించి ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు వాగబోయిన చంద్రయ్య దొర, తుడుం దెబ్బ నాయకులు కొడె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కోనవారిగూడెంలో ఇల్లు లేకున్నా నివాస ధ్రువీకరణ పత్రం ఇవ్వడం సరికాదని, పూర్తి విచారణ చేసి ఇచ్చిన ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గుండాల గ్రామపంచాయతీ నుండి మంజూరు చేసిన ఇంటి నెంబర్ లేకుండా కొనవారిగూడెంలో ఇల్లు లేకుండా నివాస ధ్రువీకరణ పత్రం ఇవ్వడం సరికాదని వారు పేర్కొన్నారు. ఈశంపై తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో పూణెం రమణబాబు, గుగ్గిల సుధాకర్ జబ్బా సుదర్శన్, ననప ప్, రాంబాబు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ రుసుము వేలంలో బానోత్ లత హవా

► రూ.66 వేలకు దక్కించుకున్న బానోత్ లత

ఇల్లందు, నవంబర్17 (ప్రజా జ్యోతి) టేకులపల్లి మండలం మొక్కంపాడు గ్రామ పంచాయతీ గ్రామ రుసుము వేలం పాట మంగళవారం ఆసక్తికరంగా సాగింది. గ్రామ పంచాయతీ సర్పంచ్ బానోత్ సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో వేలం ప్రక్రియ చేపట్టారు. పలువురు వేలం పాటలో పాల్గొనగా బానోత్ లత రూ.66 వేల అత్యధిక ధరకు గ్రామ రుసుము వసూలు హక్కులను సొంతం చేసుకున్నారు. దీంతో ఏడాది పాటు గ్రామ రుసుము వసూలు చేసే అవకాశం ఆమెకు దక్కింది. గ్రామ పంచాయతీ ఆదాయ సమీకరణలో భాగంగా ఈ వేలం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బీజ్జ కోటేశ్వరరావు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



ఘనంగా గోపాష్టమి వేడుకలు



చర్ల, నవంబర్ 17(ప్రజా జ్యోతి): చర్ల మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గోపాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చర్ల పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో గోపాష్టమి సందర్భంగా ప్రత్యేక గోపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర మందిర అర్చక పురోహిత్ సహ ప్రముఖ్ పోరుగంటి సురేష్ కుమార్, ఖమ్మం విభాగ్ సంఘటన కార్యదర్శి గడిదేశి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. చర్ల ప్రఖండ విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి శివరాజ్ కిషోర్, ఉపాధ్యక్షులు ఇరసవడ్ల రాము, మీసాల భాస్కర శ్రీనివాస్, సహ కార్యదర్శి చెరుకూరి శ్రీకర్, బజరంగ్‌దళ్ సహ సంయోజక్ గాదంశెట్టి ప్రదీప్, కార్యవర్గ సభ్యులు గోలీకార్ ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వనవాసీ కళ్యాణ పరిషత్ కార్యదర్శి జవ్వాది మురళి, వేములపల్లి ప్రవీణ్, దుర్గావాహిని సభ్యులు, ముత్యాలమ్మ ఆలయ ప్రధాన అర్చకులు శర్మ, సహాయ అర్చకులు వెంకన్న, గ్రామస్తులు దగ్గుపల్లి వెంకటేశ్వర్లు, మామిడి రాము, నిఖిల్, శేఖర్, కొండబాబుతో పాటు పలువురు మహిళలు, భక్తులు పాల్గొని గోపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పేదలకు ఇందిరమ్మ ప్రభుత్వం అండ

♦ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



బూర్గంపహాడ్, నవంబర్ 17 (ప్రజా జ్యోతి): అర్హులైన పేదలకు అండగా నిలుస్తూ సంక్షేమ పథకాల అమలుకు ఇందిరమ్మ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పినపాక ఎమ్మెల్యే, శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం బూర్గంపహాడ్ మండలంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బూర్గంపహాడ్ వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన కార్యక్రమంలో 846 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ చేయూత పింఛన్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు ఆర్థిక భరోసా కల్పిస్తాయని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, పేదల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జమలారెడ్డి, తహశీల్దార్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండలంలోని సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మీ సేవ కేంద్రాలదే ఇష్టారాజ్యం!

- మంజూరు ఒకచోట.. నిర్వహణ మరోచోట!
- ప్రభుత్వ ధరలకు పాతర.. ప్రజల నుంచి అడ్డగోలు వసూళ్లు!
- నిద్రావస్థలో సంబంధిత శాఖ అధికారులు!



అశ్వాపురం,నవంబర్ 17, ప్రజాజ్యోతి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం పరిధిలో ప్రభుత్వ అనుమతులతో నిర్వహించాల్సిన మీ సేవ కేంద్రాలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయనే ఆరోపణలు మండలంలో కలకలం రేపుతున్నాయి. ఒకచోట కేంద్రం నిర్వహణకు అనుమతులు పొందుతూ మరోచోట కార్యకలాపాలు కొనసాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ అనుమతులు ఒకచోట.. వ్యాపారం మరోచోట అన్న చందంగా వ్యవహరిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ప్రభుత్వ రేట్లు బేఖాతర్.. ప్రజలపై అదనపు భారం!ప్రభు త్వం నిర్ణయించిన రుసుముల కంటే అధికంగా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. సామాన్య ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతు న్నాయి.ప్రభుత్వ ధరల పట్టికలు అమలు చేస్తున్నారా? వినియోగదారులకు రసీదులు అందిస్తున్నారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.అనుమతులు పరిశీలించరా? అక్రమ వసూళ్లు కనిపించవా?మండలంలో మంజూరైన మీ సేవ కేంద్రాలపై అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కేంద్రాల అనుమతులు, నిర్వహణ చిరునామాలు, వసూలు చేస్తున్న రుసుములపై సమగ్ర విచారణ చేపట్టాలి. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చేయూత పెన్షన్ల పంపిణీ

- అర్హుల సంక్షేమానికి పెద్దపీట
- పెన్షన్లు పంపిణీ చేసిన సర్పంచ్ మర్రి సంధ్య మల్లారెడ్డి

అశ్వాపురం నవంబర్ 17,ప్రజాజ్యోతి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరినప్పుడే వాటి లక్ష్యం నెరవేరుతుందని మొండికుంట గ్రామ సర్పంచ్ మర్రి సంధ్యమల్లారెడ్డి అన్నారు.అశ్వాపురం మండలం మొండికుంట గ్రామపంచాయతీ పరిధిలో అర్హులైన వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు చేయూత పెన్షన్లను ఆమె పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేద కుటుంబాలకు పెన్షన్లు ఆర్థిక భరోసాగా నిలుస్తున్నాయని, ముఖ్యంగా వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు నెలవారీ పెన్షన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. గ్రామంలో అర్హత కలిగినప్రతి ఒక్కరినీ గుర్తించి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తామని పేర్కొన్నారు.ఎండీఓ ముత్యాలరావు, గ్రామపంచాయతీ కార్యదర్శి సంధ్య, వార్డు సభ్యుడు రామిడి శంబారెడ్డి, పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



ట్యాంక్ నాసిరకంగా ఉందని కళ్లకు కనిపిస్తుంటే.. లేదంటారా..?

- నాసిరకం పనులు లేవన్న ఏఈ.. అబద్ధాలు చెబుతున్నారన్న స్థానికులు
- సరైన సామాగ్రి వాడలేదని ఆరోపణ.. కమిషన్లకే లొంగిపోయారా..?
- ట్యాంక్ కూలితే మా ప్రాణాలకు ఎవరు బాధ్యులు..?
- కాంట్రాక్టర్ బిల్లులు, ఎంబీ రికార్డు చేయొద్దని స్థానికుల హెచ్చరిక
- ఉన్నతాధికారులు వెంటనే రంగంలోకి



దిగాలని డిమాండ్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు, నవంబర్ 17, ప్రజాజ్యోతి

మణుగూరు భగత్ సింగ్ నగర్ లో నిర్మిస్తున్న నీటి ట్యాంక్ వ్యవహారం రోజురోజుకూ ముదురుతోంది. నిర్మాణమే పూర్తి కాకముందే ట్యాంక్ ఒక పక్కకు వంగిందన్నవార్తతో స్థానికులు భయంతో వణికిపోతున్నారు. ట్యాంక్ ఒక పక్కకు పంగినట్టు కళ్లకు కనిపిస్తుంటే.. అధికారులు మాత్రం నాసిరకం కాదని చెప్పడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నాసిరకం నిర్మాణం వల్ల ట్యాంక్ కూలి తమ ఇళ్లపై పడితే తమ ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని వాపోతున్నారు. ఈ పరిస్థితిలో కాంట్రాక్టర్ బిల్లులు గానీ, ఎంబీ రికార్డుగానీ చేయొద్దని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో మున్సిపాలిటీ ఉన్నతాధికారులు వెంటనే పట్టించుకొని, నిష్పక్షపాత విచారణ జరిపించాలని కోరుతున్నారు. నాణ్యత లేదని తేలితే ట్యాంక్ ను కూల్చి మళ్లీ నిర్మించాలని, కాంట్రాక్టర్ ను బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.లేకుంటే రేపు ఏదైనా ప్రమాదం జరిగితే మున్సిపాలిటీ అధికారులే బాధ్యులని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై ప్రజాజ్యోతి ప్రతినిధి పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఏఈ వివరణ కోరారు.

›» స్థానికులు ఏమంటున్నారు..?

అధికారులు చెబుతున్నవన్నీ అబద్ధపు మాటలేనని స్థానికులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. అసలు ట్యాంక్ పనుల్లో ఏ మాత్రం నాణ్యత లేదని, నిర్మాణానికి సరైన సామాగ్రి వాడలేదని చెబుతున్నారు. కాంట్రాక్టర్ ఇచ్చే కమిషన్లకే అధికారులు లొంగిపోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

›» ఏఈ అధికారి ఏమన్నారంటే..

ట్యాంక్ పనుల్లో ఎలాంటి నాసిరకం పనులు జరగడం లేదని, తాము ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామని ఏఈ అధికారి తెలిపారు.

పోలీసుల అదుపులో గంజాయి సేవించిన ముగ్గురు



ఇల్లందు, నవంబర్ 17 (ప్రజా జ్యోతి) జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగంపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చర్యలు చేపడుతున్నారు.అందులో భాగంగా ఇల్లందు డీఎస్పీ యు వెంకన్నబాబు మార్గనిర్దేశంలో ఇల్లందు పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని వైద్య పరీక్షలు నిర్వహించగా, ముగ్గురికీ గంజాయి సేవించినట్లు పరీక్షల్లో నిర్ధారణ అయిందని ఇల్లందు సీఐ తాటిపాముల సురేష్ తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో సిఐ మాట్లాడుతూ గంజాయి సేవిస్తున్న ముగ్గురికి వైద్య పరీక్షల నివేదికల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యల్లో భాగంగా వారిని ఇల్లందు మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచడం జరిగిందన్నారు. అనంతరం వారిని భద్రాచలంలోని డీ-అడిక్షన్ కేంద్రానికి తరలించారని తెలిపారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు అవడం వల్ల వ్యక్తుల ఆరోగ్యం, భవిష్యత్తు, కుటుంబ జీవితం తీవ్రంగా ప్రభావితమవుతాయని తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా సమాజ భద్రతకు కూడా ముప్పుగా పరిణమిస్తుందని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్య, ఉపాధి, ఉన్నత లక్ష్యాలపై దృష్టి సారించాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగానికి పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత్తు పదార్థాలకు బానిసైన వారు స్వచ్ఛందంగా డీ-అడిక్షన్ కేంద్రాల సేవలను వినియోగించుకుని వ్యసనాల నుంచి బయటపడాలని పోలీసులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు ఉమ, సారంగపాణి, సిబ్బంది లాల్ సింగ్, రవి, బాలు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- మర్కోడు కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం :- ఎస్కే ఖదీర్



ఆళ్ళపల్లి,నవంబర్17(ప్రజాజ్యోతి) పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీసీ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న ఆదేశాల మేరకు ఆళ్ళపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వాసం శ్రీకాంత్ అధ్యక్షతన మర్కోడు గ్రామపంచాయతీలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఎస్కే ఖదీర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్కే ఖదీర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.సిద్దిపేటలో జరగనున్న భారీ బహిరంగ సభలో ప్రకటించనున్న ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆళ్ళపల్లి సర్పంచ్ వాసం సుస్మిత, అనంతోగు సర్పంచ్ కల్తి వెంకటేశ్వర్లు, రాయిపాడు సర్పంచ్ ఊకె చిన్న పాపయ్య, రామాంజిగూడెం సర్పంచ్ మోకాళ్ల చంద్రశేఖర్, బోడాయికుంట సర్పంచ్ ఏడుర్ల శ్రావణి, మర్కోడు సర్పంచ్ సుతారి రమాదేవి, ఉప సర్పంచ్ వగలబోయిన సతీష్, ఆత్మకమిటీ చైర్మన్ బుర్ర రవి, ఎస్కే పర్వీన్, కేక్కెర్ల సునీత తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీల అమలు ఏమయ్యాయి

♦ రేగ కాంతారావు

గుండాల నవంబర్ 17 ప్రజా జ్యోతి హామీలు ఇచ్చి అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పాతాళానికి పాత్రయాలను బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు పినపాక మాజీ శాసనసభ్యులు రేగ కాంతారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కోసం 420 హామీలతో మేనిఫెస్టో విడుదల చేసి ప్రజలు నమ్మించి అధికారంలోకి వచ్చాక అమలు చేయడంలో విఫలమైందన్నారు. మేనిఫెస్టో విడుదల చేసి నేటికీ మూడు సంవత్సరాలు పూర్తి అవుతున్న మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. మూడేళ్ల రేవంత్ రెడ్డికి కెసిఆర్ ని తిట్టడమే సరిపోయిందని ఆయన పేర్కొన్నారు. హామీల అమలు లో పూర్తిగా విఫలమైన ప్రభుత్వం ప్రజలను పక్కదారి పట్టించేందుకు దైవ దర్శన్ రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు. సంక్షేమం లో పూర్తిగా విఫలమైనప్పటికీ అభివృద్ధిలో సైతం పైసా ఖర్చు పెట్టలేదని ఆయన అన్నారు. మేనిఫెస్టో ప్రతులను పార్టీ నాయకులతో కలిసి చింపి చెత్తబుట్టలో పడేవేశారు. ఈ కార్యక్రమంలో బెల్లం భాస్కర్, మోకాళ్ళ వీరస్వామి, గడ్డం వీరన్న, వట్టం రవి, ఇరుకుల్లూరి రాము, గొల్లపల్లి రమేష్, నిట్ట రాములు తదితరులు పాల్గొన్నారు



ఇందిరమ్మ బీమా అమలుకు పకడ్బందీ చర్యలు

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన
- అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా పరిహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం





కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 18, (ప్రజాజ్యోతి) కొత్తగూడెం జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం విజయవంతానికి పకడ్బందీ చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన అధికారులను ఆదేశించారు. ఈ పథకం అమలులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అర్హులైన కుటుంబాల వివరాలను ఖచ్చితంగా సేకరించి నమోదు చేయాలని సూచించారు.ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం అమలులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థలఅదనపు కలెక్టర్ విద్యా చందన,జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నాగలక్ష్మి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జె. సునీత పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విద్యా చందన మాట్లాడుతూ కుటుంబానికి ప్రధాన జీవనాధారంగా ఉన్న సంపాదనపరుడు అనుకోని పరిస్థితుల్లో మరణిస్తే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా రూ.5 లక్షల జీవిత బీమా పరిహారం అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పథక మార్గదర్శకాల ప్రకారం అర్హులైన కుటుంబాలను గుర్తించి నమోదు చేయాలని, కులం, ఆదాయం, ఏపీఎల్, బీపీఎల్ వంటి అంశాలతో సంబంధం లేకుండా నిర్దేశించిన అర్హతల ఆధారంగా లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు.బీమా పొందే వ్యక్తి వయస్సు 18 నుంచి 59 సంవత్సరాల మధ్య ఉండాలని తెలిపారు.పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను పూర్తిస్థాయిలో అవగాహన చేసుకొని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని అన్నారు. అర్హులైన కుటుంబాల వివరాలను నిర్దేశించిన విధానంలో సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఆధార్ నంబర్, మొబైల్ నంబర్, కుటుంబ సభ్యులు, నామినీల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. నామినీ మైనర్ అయితే సంరక్షకుడి వివరాలను కూడా తప్పనిసరిగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. దరఖాస్తులో పొందుపరిచిన వివరాలను బీమాదారుడికి చదివి వినిపించి, సరిచూసిన అనంతరం ఆయన సంతకం తీసుకోవాలని తెలిపారు.గ్రామాల్లో నిర్వహించే శిబిరాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇంటర్నెట్ సదుపాయాలతో పాటు టెంట్లు, కుర్చీలు, తాగునీరు, మైక్ పంటిమౌలికసదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. దరఖాస్తుదారులకు సహాయం అందించేందుకు ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడంతో పాటు డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మార్గనిర్దేశం చేసే సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణీ మహిళలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు.రేషన్ కార్డుల ఆధారంగా అందుబాటులో ఉన్నప్రీ-ఫిల్డ్‌డేటాను ఉపయోగించుకొని దరఖాస్తులు నింపాలని, రేషన్ కార్డులు లేని కుటుంబాల వివరాలను ప్రత్యేక ఖాళీ దరఖాస్తుల ద్వారా సేకరించాలని తెలిపారు. ప్రతి వివరాన్ని జాగ్రత్తగా పరిశీలించి నమోదు చేయాలని, శిక్షణలో అందించిన సూచనలు,సాంకేతిక అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ-డీఎం సైదేశ్వరరావు సమావేశంలో ఆన్ లైన్ దరఖాస్తు నమోదు ప్రక్రియను ప్రత్యక్షంగా చేసి చూపించారు. నమూనా దరఖాస్తును నింపుతూ ప్రీ-ఫిల్డ్ డేటా పరిశీలన, బీమాదారుడు,నామినీల వివరాల నమోదు విధానాన్ని వివరించారు.దరఖాస్తుల స్వీకరణ, ఆన్ లైన్ నమోదు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.నమోదైన దరఖాస్తులను స్కాన్ చేసి సంబంధిత బీమా సంస్థకు పంపించాలని, అసలు దరఖాస్తులను ఎంపీడీవో కార్యాలయంలో భద్రపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు,జిల్లా వ్యాప్తంగా ఉన్న పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్‌కు గాయాలు

- త్వరగా కోలుకొని ప్రజా ఉద్యమాల్లోకి రావాలి: మచ్చ వెంకటేశ్వర్లు



భద్రాచలం, నవంబర్ 17 (ప్రజా జ్యోతి): సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు, సీఐటీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్ సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శుభకార్యానికి హాజరై ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా, రోడ్డు పక్కన నిలిపిన కారు డోర్ అకస్మాత్తుగా తెరవడంతో దాన్ని ఢీకొని కిందపడిపోయారు.వెంటనే నికిత ఆసుపత్రికి తరలించగా వైద్యులు అత్యవసర చికిత్స అందించారు. భుజానికి నిర్వహించిన పరీక్షల్లో కుడి చేతి భుజం ఎముక మూడు చోట్ల విరిగినట్లు గుర్తించారు. శస్త్రచికిత్స అవసరమని వైద్యులు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం ఆసుపత్రికి చేరుకుని ఆయన ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు.ప్రమాద విషయం తెలుసుకున్న సీపీఎం పట్టణ, జిల్లా నాయకులు ఆసుపత్రికి చేరుకుని వైద్యులతో మాట్లాడారు. మంగళవారం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య తదితరులు రమేష్‌ను పరామర్శించారు. వారు మాట్లాడుతూ ఏజే రమేష్ త్వరగా కోలుకుని తిరిగి ప్రజా ఉద్యమాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఉద్యమాలతో పాటు నాయకులు, కార్యకర్తలు తమ ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని సూచించారు.

రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన నాగేశ్వరరావుకు ఘన సన్మానం

- శుభాకాంక్షలు తెలిపినఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్



భద్రాచలం, నవంబర్ 17 (ప్రజా జ్యోతి): భద్రాచలం రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చల్లగుల్ల నాగేశ్వరరావును పెన్షనర్లు ఘనంగా సత్కరించారు. స్థానిక ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డివిజన్ కార్యాలయంలో అధ్యక్షుడు బంధు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బంధు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం ఆనందంగా ఉందన్నారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ కొత్త బాధ్యతతో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తానని తెలిపారు.కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు చంద్ర సుబ్బయ్య చౌదరి, ప్రధాన కార్యదర్శి కేవీఎల్వీ ప్రసాద్, కోశాధికారి డి.కృష్ణమూర్తి, సంఘం నాయకులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత భద్రాద్రి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- ఎమ్మెల్యే వెంకటరావు



భద్రాచలం, నవంబర్ 17 (ప్రజా జ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రమైన భద్రాచలాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు, సర్పంచ్ పూనెం కృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం గ్రీన్ భద్రాద్రి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్లాస్టిక్ నియంత్రణ, ప్రత్యామ్నాయ మార్గాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.వృక్షమిత్ర అవార్డుగ్రహీత డా. గోళ్ల భూపతిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే, సర్పంచ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిని కలుషితం చేయడమే కాకుండా పశుపక్ష్యాదులు, జలచరాల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు గ్రీన్ భద్రాద్రి చేస్తున్న కృషిని అభినందించారు. వ్యాపారులు, అధికారులు, ప్రజలు సమష్టిగా ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడి గుడ్డ సంచులను అలవాటు చేసుకోవాలని సూచించారు.డా. గోళ్ల భూపతిరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధం నినాదానికే పరిమితం కాకుండా ప్రతి విద్యార్థి తమ ఇంటి నుంచే మార్పును ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రమాదేవి, కళాశాల ప్రిన్సిపాల్ సంపత్, హెచ్ఎంజాన్సన్, బండారుశరత్, రమణ, జి.ఎస్.శంకర్ రావు, కామిశెట్టి కృష్ణార్జునరావు, భీమవరపు వెంకటరెడ్డి, కొమ్మనాంపల్లి ఆదినారాయణ, మహమ్మద్ జిందా, కృష్ణవేణి, భావన తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా మట్టి తరలింపు.. లారీ పట్టివేత

- సీతారామ ప్రాజెక్టు మట్టి అక్రమ రవాణాపై ఇరిగేషన్ అధికారుల చర్యలు



బూర్గంపహాడ్, నవంబర్ 17 (ప్రజా జ్యోతి): సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన మట్టిని ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న లారీని ఇరిగేషన్ అధికారులు పట్టుకున్నారు.బూర్గంపహాడ్ మండలం జింకలగూడెం సమీపంలో అక్రమంగా మట్టి రవాణా జరుగుతున్నట్లు గుర్తించిన ఇరిగేషన్ శాఖ అధికారులు వెంటనే స్పందించి లారీని అడ్డుకున్నారు.వివరాల్లోకి వెళితే.. సీతారామ ప్రాజెక్టు పరిధి నుంచి ప్రభుత్వ అనుమతులు పొందకుండా మట్టిని తరలిస్తున్నట్లు గుర్తించిన ఇరిగేషన్ ఏఈ వెంకటేష్,లారీని తనిఖీ చేసి అడ్డుకున్నారు.అనంతరం TS28TA6669 నంబరు గల లారీని స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం బూర్గంపహాడ్ పోలీసులకు అప్పగించారు.ఈ ఘటనపై ఇరిగేషన్ అధికారులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసిదర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది.ప్రభుత్వప్రాజెక్టులకు సంబంధించిన మట్టి,ఇతర వనరులను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిక జారీ చేశారు.

శబరి నిలయానికి మిక్స్‌డ్, సామగ్రి వితరణ



చర్ల, నవంబర్ 17(ప్రజా జ్యోతి): వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో చర్లలో నిర్వహిస్తున్న శబరి బాలికా నిలయానికి దాతలు తమ వంతు సహాయ సహకారాలు అందించారు.నిలయ కమిటీ సభ్యురాలు పోలిన రమాదేవి బంధువులైన గొట్టిపాటి హిమజ, నల్లూరి ఉదయలక్ష్మి బాలికా నిలయానికి మిక్స్‌డ్‌ని అందజేశారు.అలాగే ఢిల్లీ బజార్ యజమాని చింతలపూడి వెంకటరమణ విద్యార్థినులకు అవసరమైన అలంకరణ సామగ్రితో పాటు అద్దాన్ని వితరణ చేశారు.ఈ సందర్భంగా నిలయ కమిటీ కార్యదర్శి బండా స్వరూపరాణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వనవాసీ గౌరవ సలహాదారు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బీవీఎస్ఎల్ నరసింహారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే గిరిజన బాలికల కోసం వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో చర్లలో మొట్టమొదటి బాలికా నిలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గిరిజన బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో, శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.బాలికా నిలయం ప్రారంభమైన మొదటి ఏడాదిలోనే విద్యార్థినుల అవసరాలను గుర్తించి దాతలు వివిధ రూపాల్లో సహాయ సహకారాలు అందించడం సంతోషకరమన్నారు. మరింత మంది దాతలు ముందుకొచ్చి సహకారం అందించడం ద్వారా గిరిజన బాలికల విద్యాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కొమరం భీం నిలయ కమిటీ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, సహ కోశాధికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, శబరి బాలికా నిలయ సహ కార్యదర్శి బుటారి సుజాత, కమిటీ సభ్యురాలు పోలిన రమాదేవి, చింతలపూడి వెంకటరమణ, నిలయ ప్రముఖ్ వరలక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ గృహాల తుది బిల్లులు రాక.... ఎదురుచూపులు

లక్ష్మీదేవి పల్లి ,నవంబర్ 17 ,ప్రజా జ్యోతి: లక్ష్మీదేవి పల్లి మండలం లోని అన్ని పంచాయతీలలో ఇందిరమ్మ గృహాలు మొదటి విడతలో లబ్ధిదారులు అయినా వాళ్లకు ఇల్లు నిర్మాణం పూర్తి అయి సంవత్సరం దగ్గర పడుతున్నప్పటికీ ఇప్పటిదాకా వారి వారు తుది బిల్లులు రాక చాలా ఇబ్బందులకు గురవుతున్నారు ఇల్లు నిర్మాణంకు చేసుకున్న అప్పు వడ్డీ కూడా పెరిగిపోయిందని అదేవిధంగా పేద ప్రజల విషయంలో బిల్లుల జాప్యం ఏంటని ఇది పేద రాష్ట్రం కాదు అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం కదా ఇలాంటి దినమైన పరిస్థితి ఉంటదా అని ప్రజల్లో అసంతృప్తి మొదలైందని గుసగుసలు వినిపిస్తున్నాయి ఇప్పటికైనా ఇందిరమ్మ గృహాల మొదటి విడతలోని బిల్లు విషయంలో ఎటువంటి జాప్యం చేయకుండా గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరలోనే లబ్ధిదారులకు బిల్లులు విషయంలో ఏవిధంగా నిర్ణయం తీసుకుంటారని ప్రజలు ఆశ భావం వ్యక్తం చేస్తున్నారు.

ఇందిరమ్మ విగ్రహావిష్కరణను విజయవంతం చేయండి

► ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



ములకలపల్లి, నవంబర్ 17 (ప్రజాజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఈనెల 19న నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించనున్న ఇందిరమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కోరారు. మంగళవారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19న ఉదయం 10 గంటలకు అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో ఇందిరాగాంధీ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా రూ.5 లక్షల పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి అశ్వారావుపేట నియోజకవర్గంలోని ఐదు మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, ఇందిరమ్మ లబ్ధిదారులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ జహీరుద్దీన్,మాజీ మండల అధ్యక్షుడు పెటేటి నరసింహారావు,జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యుడు రత్నభూషణం,సీతారాంపురం సర్పంచ్ కుంజా రవి,సీతాయిగూడెం మాజీ సర్పంచ్ కారం సుధీర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోడిమె వంశీ, గాదెగోని జగదీష్, పామర్తి జగన్నాథం, పిడియాల వెంకటేష్, కుర్సం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని మజ్జూరి యోక్షిత

► వాలీబాల్ క్రీడలో రాష్ట్రస్థాయిలో రెండవ స్థానం కైవసం



భద్రాచలం, నవంబర్ 17 (ప్రజాజ్యోతి) సంగారెడ్డిలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ ఫెడరేషన్ క్రీడలలో అండర్ 14 విభాగం వాలీబాల్ క్రీడలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం గర్ల్స్ హై స్కూల్ కి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని.మజ్జూరి యోక్షిత ఉత్తమ ప్రతిభను కనబరిచింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి క్రీడలలో చక్కని క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించిన యోక్షిత రాష్ట్రస్థాయి అండర్ 14 వాలీబాల్ క్రీడలకు ఎంపిక అయింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా వాలీబాల్ టీం లో చోటు దక్కించుకుంది నవంబర్ 13 14 15 తేదీలలో సంగారెడ్డి పట్టణంలో జరిగిన స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ లో వాలీబాల్ క్రీడలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ద్వితీయ స్థానం సాధించగా ఈ టీంలో ప్రాతినిధ్యం వహించిన మజ్జూరి యోక్షిత ఉత్తమ ప్రతిభను క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జట్టు విజయానికి మంచి ప్రదర్శన చేసింది. రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన వాలీబాల్ క్రీడాకారిని మజ్జూరి యోక్షిత అని ప్రధానోపాధ్యాయులు రామా పి ఈ టి సుజాత పలువురు ఉపాధ్యాయులు అభినందించారు యోక్షిత మునుముందు రాష్ట్ర జాతీయ క్రీడా వేదికల మీద తన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి ఉన్నతశ్రేణి క్రీడాకారునిగా ఎదగాలని ఆకాంక్షించి అభినందనలు తెలియజేశారు.

చర్లలో మావోయిస్టుల డంప్ స్వాధీనం





- 280 బీజీఎల్ మిల్స్ స్వాధీనం
- లొంగిపోయిన మావోయిస్టు సమాచారంతో పోలీసుల గాలింపు

చర్ల, నవంబర్ 17(ప్రజా జ్యోతి): చర్ల మండలంలోని తెలంగాణ–ఛత్తీస్ గఢ్ రాష్ట్ర సరిహద్దు అటవీ ప్రాంతంలో సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన పీఎల్ జీఏ బెటాలియన్ డంప్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల లొంగిపోయిన మావోయిస్టు అందించిన విశ్వసనీయ సమాచారం మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు, స్పెషల్ పార్టీ సిబ్బంది, బీఎస్ఎఫ్ బలగాలు సంయుక్తంగా చేపట్టిన గాలింపు చర్యల్లో ఈ డంప్ బయటపడింది.ఈ నెల 15న లొంగిపోయిన చర్ల ఏరియా కమిటీకి చెందిన మాజీ మావోయిస్టు ఇచ్చిన సమాచారంతో చర్ల మండలంలోని గ్రామాలకు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో మావోయిస్టులు గతంలో రహస్యంగా దాచిపెట్టిన డంప్ ను గుర్తించారు. అందులో మొత్తం 280 బీజీఎల్ మిల్స్ ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.2025 సంవత్సరం ప్రారంభంలో పీఎల్ జీఏ బెటాలియన్ కు చెందిన ఒక కంపెనీ విభజన సమయంలో ఈ బీజీఎల్ మిల్స్ ను అటవీ ప్రాంతంలోని డంపుల్లో దాచిపెట్టినట్లు పోలీసులు గుర్తించారు.సురక్షితమైన ప్రాంతంగా భావించిన మావోయిస్టులు భవిష్యత్తులో అవసరాల కోసం వీటిని నిల్వ ఉంచినట్లు తెలిపారు. మావోయిస్టు కార్యకలాపాలు తిరిగి ప్రారంభమైన ప్పుడు వీటిని వినియోగించుకోవాలనే ఉద్దేశంతో డంప్ చేసినట్లు తెలిపారు. మరోవైపు, తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న లొంగుబాటు,పునరావాస విధానానికి ఆకర్షితులై పలువురు మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వస్తున్నారని పోలీసులు తెలిపారు. లొంగిపోయిన వారు గతంలో దాచిపెట్టిన ఆయుధాలు, ఇతర సామగ్రికి సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు అందిస్తున్నారని అన్నారు. 2024 నుంచి ఇప్పటివరకు వివిధ స్థాయిలకు చెందిన 824 మంది మావోయిస్టు క్యాడర్లు తెలంగాణ ప్రభుత్వానికి లొంగిపోయినట్లు వెల్లడించారు. లొంగిపోయిన వారికి నగదు ప్రోత్సాహకాలు, ఇంటి స్థలాలు, వ్యవసాయ భూమి, గృహ నిర్మాణానికి బ్యాంకు రుణాలు, ఆరోగ్య బీమా కార్డులతో పాటు స్వయం ఉపాధి కోసం నైపుణ్య శిక్షణ వంటి సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికీ కొందరు మావోయిస్టులు అజ్ఞాతంలోనే ఉన్నారని, వారు హింసామార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని తెలంగాణ పోలీసులు పిలుపునిచ్చారు. ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాస అవకాశాలను సద్వినియోగం చేసుకొని రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

పుట్టినరోజు కేక్ లో పెద్ద పురుగు..!

- బర్త్ డే వేడుక కాస్తా భయాందోళన..!
- మణుగూరు కేక్ ఫ్యాక్టరీ షాప్ లో కొన్న కేక్ లోనే ఈ ఘటన...
- కేక్ కట్ చేస్తుండగానే బయటపడిన పురుగు.. షాక్ లో ఫ్రెండ్స్...
- ఫ్రెష్ కేకా..? స్టాక్ కేకా..? అసలు ఏం అమ్ముతున్నారు..?
- పిల్లలు తింటే ఏమయ్యేది..? ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎక్కడ..?



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు, నవంబర్ 17, ప్రజాజ్యోతి పుట్టినరోజు అంటే సంతోషం.. కానీ ఇక్కడ పుట్టినరోజు వేడుక కాస్తా కడుపులో దేవేసినట్టయింది. మణుగూరులోని ప్రముఖ కేక్ ఫ్యాక్టరీ షాప్ లో కొనుగోలు చేసిన కేక్ లో పెద్ద పురుగు వచ్చిందని సింగరేణి ఉద్యోగస్తుడు ఆరోపించారు. పుట్టినరోజు సందర్భంగా స్నేహితులు మణుగూరులోని కేక్ ఫ్యాక్టరీ షాప్ లో కేక్ కొనుగోలు చేశారు. అయితే సంతోషంగా కేక్ కట్ చేయడానికి సిద్ధమవుతుండగా.. కేక్ లో నుంచి పెద్ద పురుగు బయటకు వచ్చిందని ఉద్యోగి తెలిపారు. దీంతో అక్కడ ఉన్న స్నేహితులంతా ఒక్కసారిగా షాక్ కు గురయ్యారు. బర్త్ డే వేడుక అర్ధాంతరంగా ఆగిపోవడం గమనార్హం. అసలు ఈ షాపు వాళ్లు కేక్ ను ఫ్రెష్ గా చేసి అమ్ముతున్నారా..? లేక ఎప్పుడో చేసిన స్టాక్ కేక్ ను డెలివరీ చేస్తున్నారా..? అనే అనుమానం ఇప్పుడు స్థానికుల్లో చర్చనీయాంశం మారింది. ఫ్రెష్ కేక్ లో పురుగు ఎలా వస్తుందని సింగరేణి ఉద్యోగి ప్రశ్నించారు. షాపులో పరిశుభ్రత లోపించిందా..? అని కూడా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ ఆ కేక్ ను పిల్లలు, పెద్దలు తెలియకుండా తిని ఉంటే పరిస్థితి ఏమయ్యేదని ఉద్యోగి ఆందోళన వ్యక్తం చేశారు. ఫుడ్ పాయిజన్ అయితే ఎవరు బాధ్యులని నిలదీశారు. ఈ విషయంపై ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంటనే స్పందించి.. ఆ షాపులో తనిఖీలు చేయాలని, కేక్ లు ఎలా తయారు చేస్తున్నారని.. ఎన్ని రోజుల స్టాక్ అమ్ముతున్నారో విచారణ జరిపించాలని బాధితుడు డిమాండ్ చేస్తున్నారు.

షాపు యజమానిని ప్రజాజ్యోతి వివరణ కోరగా..

మా షాప్ లో కేక్ ఎప్పుడు ఫ్రెష్ గానే ఉంటాయి. కానీ ఆ కేక్ లో పురుగు ఎలా వచ్చిందో తమకు తెలియదన్నారు. ఉద్యోగికి మళ్ళీ వేరే కేక్ పంపించామని తెలిపారు. ఇంకెప్పుడు ఇలా జరగకుండా చూసుకుంటామని తెలిపారు.

కాంకేర్‌లో నక్సలైట్ డంప్ గుర్తింపు

- భర్మర్ గన్, ఐఈడీ మెకానిజం, గన్‌పౌడర్ స్వాధీనం

చర్ల,నవంబర్ 17:(ప్రజాజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లాలో నక్సలైట్ నిర్మూలన చర్యల్లో భద్రతా దళాలు కీలక విజయం సాధించాయి. కోయిలిబేడ పోలీస్ స్టేషన్ పరిధిలోని మోడెమార్క, మిచ్చెబేడ గ్రామాల మధ్య ఉన్న అటవీ, కొండ ప్రాంతంలో నిర్వహించిన గాలింపు చర్యల్లో నక్సలైట్లకు చెందిన డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు.నవంబర్ 16న జిల్లా పోలీసు దళం, సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్), బాంబు డిస్పోజల్ స్క్వాడ్ (బీడీఎస్) సంయుక్తంగా ఈ గాలింపు ఆపరేషన్ చేపట్టాయి. ఈ సందర్భంగా ఒక భర్మర్ గన్, సుమారు ఒక కిలోగ్రాము అనుమానిత ఐఈడీ యంత్రాంగం, ఒక కిలోగ్రాము గన్‌పౌడర్, రెండు డిటోనేటర్లు, ఇతర నక్సలైట్ సామగ్రిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.భద్రతా కారణాల దృష్ట్యా స్వాధీనం చేసుకున్న ఐఈడీ, ఇతర పేలుడు పదార్థాలను బాంబు నిర్వీర్య బృందం అక్కడికక్కడే ధ్వంసం చేసింది. బస్తర్ రేంజ్ ఐజీ బద్రి నారాయణ్ మీనా, బీఎస్ఎఫ్ డీఐజీ దీపక్ తివారీ, కాంకేర్ ఎస్పీ నిఖిల్ రాఖేచా, బీఎస్ఎఫ్ 40వ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండర్ నరేంద్ర శర్మ మార్గదర్శకత్వంలో ఈ ఆపరేషన్ నిర్వహించారు.నక్సలైట్ ప్రభావిత సరిహద్దు ప్రాంతాల్లో భద్రతా దళాలు నిరంతరం సంయుక్త గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయని కాంకేర్ పోలీసులు తెలిపారు. ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణ, నక్సలైట్ కార్యకలాపాల నియంత్రణే లక్ష్యంగా ఈ చర్యలు కొనసాగుతాయని తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం









- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ
- చేయూత పింఛన్లతో ఒంటరి మహిళలు, దివ్యాంగులు, వితంతువులకు ఆర్థిక భరోసా

ములకలపల్లి నవంబర్ 17 (ప్రజాజ్యోతి): సమాజంలో ఆత్మగౌరవంతో జీవించాలనే సంకల్పం ప్రతి ఒక్కరిలో రావాలని, అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే తన లక్ష్యమని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. మంగళవారం ములకలపల్లిలో నిర్వహించిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భర్తను కోల్పోయి ఒంటరిగా జీవిస్తున్న వితంతువులు, కుటుంబ పోషణ భారంగా మారిన ఒంటరి మహిళలు, దివ్యాంగులు సమాజంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

అలాంటి వారి జీవితాల్లో భరోసా నింపాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేయూత పింఛన్ల కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. పింఛన్లు పొందుతున్న ప్రతి ఒక్కరూ ఆత్మన్యూనత భావాన్ని వీడి ధైర్యంగా సమాజంలో ముందుకు సాగాలని సూచించారు. మండలంలో మొత్తం 620మంది దరఖాస్తు చేసుకోగా,తొలి విడతలో 516 మందికి పింఛన్ల మంజూరు ప్రొసీడింగ్స్ అందిస్తున్నట్లు తెలిపారు. మిగిలిన 104 మంది దరకాస్తుదారుల ఇళ్లకు అధికారులు, పంచా యతీ కార్యదర్శులు, సర్పంచులు అర్హుల దరఖాస్తులను కూడా పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. ఈ నెల 19న ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా లబ్ధిదారుల ఖాతాల్లో పింఛన్ డబ్బులు జమ అవుతాయని వెల్లడించారు.

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, నియోజకవర్గానికి ఇప్పటివరకు 4,750 ఇళ్లు మంజూరు చేయించామని తెలిపారు. పేదల ఇళ్లపై రేకుల స్థానంలో డాబా నిర్మాణాలు ఉన్నాయనే కారణంతో అర్హులకు అన్యాయం జరగకుండా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి నిజమైన నిరుపేదలకు న్యాయం చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ వంటి పథకాలతో పేద కుటుంబాలకు అండగా నిలుస్తోందని వివరించారు. విద్యార్థుల కోసం మండలంలో అల్పాహార పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్యసాయం అందిస్తున్నామని, క్యాన్సర్ బాధితులకు కూడా ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి పక్షపాతం ఉండకూడదని అధికారులకు సూచించారు. అర్హులకు పింఛన్లు అందకుండా నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి లబ్ధిదారుడికి పథకాలపై స్పష్టమైన సమాచారం అందించాలని, గ్రామ స్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

ఈ కార్యక్రమం విజయవంతానికి సహకరించిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడి యా ప్రతినిధులకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు..ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ, మండల స్పెషల్ ఆఫీసర్ రమేష్‌బాబు, ఎంపీఓ రమేష్, ఏఓ అరుణ్ బాబు,ఎంఈఓ సత్యనారాయణ,ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వరప్రసాద్,పశువైద్యాధికారి రామ కృష్ణ హోసింగ్ ఏఈ లు శ్రీధర్, సాహిత్య, సర్పంచులు కొర్సా చంద్ర లేఖ, కుంజా రవి, తుర్రం శ్రీను, మడకం రవి, కొర్సా ఆదిలక్ష్మి, తానం పద్మ, మడకం విజయ, మడివి చంద్ర కళ,సోడెచైతన్య,ఆదిలక్ష్మి,ధర్మ,వాడే రాములు, కారం వెంకటేశ్వర్లు, సుజాత, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిళా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పొదిలి జ్యోతి,జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మ రాంబాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎండీ జహీర్, తాండ్ర ప్రభాకరరావు కారం సుధీర్, పెటేటి నరసింహారావు, రత్న భూషణం, మడకం చిరుమప్ప, సిపిఐ పార్టీ జిల్లా నాయకులు నరాటి ప్రసాద్, జాని, సురభి రాజేష్, గుంటూరు సాయిరాం, మడకం శ్రీనివాస్ మరియు పంచాయితీ కార్యదర్శులు తదితరులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.20 లక్షలతో ఏజెంట్ పరార్.. మహిళలకు రుణ వేధింపులు

- మైక్రో ఫైనాన్స్ బాధితుల గోడు.. 25 మంది మహిళలకు న్యాయం చేయాలని డిమాండ్
- పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసిన బాధితులు

ములకలపల్లి నవంబర్ 17 (ప్రజాజ్యోతి): బ్యాంకు రుణాలు ఇప్పిస్తామని నమ్మించి సుమారు 25 మంది మహిళల నుంచి రూ.20 లక్షలు వసూలు చేసిన సూక్ష్మరుణ సంస్థ ఏజెంట్ పరారైన ఘటన ములకలపల్లి మండలంలో కలకలం రేపుతోంది.

మూకమామిడి పంచాయతీ పరిధిలోని సాయిరాంపురం గ్రామానికి చెందిన గడ్డం వెంకటేష్ (35) అనే ఏజెంట్ డబ్బులు వసూలు చేసి కనిపించకుండా పోయాడని బాధిత మహిళలు ఆరోపిస్తున్నారు.



ఏజెంట్ మోసం.. మహిళలకు రుణభారం!

రుణాలు ఇప్పించడంతో పాటు వాటి వాయిదాలను తానే చెల్లిస్తానని నమ్మబలికి ఏజెంట్ మహిళల నుంచి విడతలవారీగా డబ్బులు వసూలు చేసినట్లు బాధితులు చెబుతున్నారు.

సుమారు రూ.20 లక్షలు వసూలు చేసిన అనంతరం ఏజెంట్ పరారవడంతో మహిళలు ఆందోళనకు గురవుతున్నారు. మరోవైపు రుణ బకాయిలు చెల్లించాలంటూ ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు తమ ఇళ్లకు వచ్చి ఒత్తిడి చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు.

తమ వద్ద డబ్బులు వసూలు చేసిన వ్యక్తి కనిపించకుండా పోతే, తామెందుకు రుణ బకాయిలు చెల్లించాలని మహిళలు ప్రశ్నిస్తున్నారు.

ఏజెంట్ మోసానికి గురైన తమ పరిస్థితిని అర్థం చేసుకొని న్యాయం చేయాలని సంస్థ, వసూళ్ల పేరుతో ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తమపై మరింత భారం మోపవద్దని వేడుకుంటున్నారు.

పోలీసులను ఆశ్రయించిన బాధితులు

ఏజెంట్ మోసంపై బాధిత మహిళలు, గ్రామస్తులు కలిసి ములకలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పరారీలో ఉన్న ఏజెంట్‌ను గుర్తించి పట్టుకోవడంతో పాటు, మహిళల నుంచి వసూలు చేసిన సుమారు రూ.20 లక్షలు తిరిగి ఇప్పించాలని కోరారు.

మైక్రో ఫైనాన్స్ సంస్థ ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై స్పందించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మోసానికి గురైన మహిళలపై రుణ వసూళ్ల పేరుతో ఒత్తిళ్లు నిలిపివేయాలని, ఏజెంట్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భద్రాచలంలో భద్రత కరువు!

- ఆదివాసీ యువకుడి హత్యపై జేపసీ ఆగ్రహం
- నిందితులను అరెస్టు చేయాలి.. లాడ్జిని సీజ్ చేయాలి
- దమ్మపేట ఆదివాసి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్




దమ్మపేట,నవంబర్.17,(ప్రజాజ్యోతి): భద్రాచలంలో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమవుతోందని దమ్మపేట ఆదివాసీ జేపసీ నాయకులు ఆరోపించారు. భద్రాచలంలోని ఓ ప్రైవేటు లాడ్జిలో ఆదివాసీ యువకుడు తెల్లం శరత్ హత్యకు గురైన ఘటనను ఖండించారు. అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టిపంపు గ్రామానికి చెందిన శరత్ గది కోసం లాడ్జికి వెళ్లగా యాజమాన్యం,సిబ్బంది దాడి చేసి హత్య చేసినట్లు వచ్చిన ఆరోపణలపై ఆందోళన వ్యక్తం చేశారు. నిరుపేద ఆదివాసీ యువకుడి మృతికి కారకులైన వారిని తక్షణమే అరెస్టు చేసి హత్యకేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత ప్రైవేటు లాడ్జి లైసెన్స్‌ను రద్దు చేసి సీజ్ చేయాలని కోరారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలోనే ప్రజలకు రక్షణ లేకపోవడం ఆందోళనకరమని, వరుస నేరాలపై ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. భద్రాచలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని కోరారు.మృతుడు తెల్లం శరత్ కుటుంబం నిరుపేద కుటుంబమని, ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు తగిన ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ జేపసీ నాయకులు కొర్సా వెంకటేష్ దొర, బండారు సూర్యనారాయణ, తోలెం శ్రీను, ఊకే అప్పారావు,కారం నాగేంద్రబాబు,కారం బోడయ్య,తంబళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల కొరడా

- సంగం గ్రామ శివారులో ఇసుక ట్రాక్టర్ పట్టివేత
- రూ.4 వేల విలువైన ఇసుక స్వాధీనం.
- ట్రాక్టర్, ట్రాలీ సీజ్ డ్రైవర్ అదుపులోకి

పాల్వంచ, నవంబర్ 17, ప్రజాజ్యోతి: ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పాల్వంచ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌తో పాటు ట్రాలీని, అందులో ఉన్న ఇసుకను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో అందిన సమాచారం మేరకు సంగం గ్రామ శివారులో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించి, దానిని నడుపుతున్న తమ్మల్ల వెంకట దుర్గాప్రసాద్ (30)ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తన తండ్రి పేరు మీద ఉన్న ఈచర్ 480 ట్రాక్టర్‌ను తానే నడుపుతున్నానని,ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా దంతలబోర గ్రామ శివారులోని మొర్రేడు వాగు నుంచి ఇసుకను ట్రాలీలో నింపుకుని పాల్వంచ ప్రాంతంలో విక్రయించేందుకు తీసుకువస్తున్నట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు నీలం రంగు ఈచర్ 480 ట్రాక్టర్ (నంబర్ TS 28 TA 0294), ఎరుపు రంగు ట్రాలీతో పాటు సుమారు రూ.4 వేల విలువైన ఇసుకను పంచుల సమక్షంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై చట్టప్రకారం తదుపరి చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.



అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం

ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకం, రవాణా, విక్రయాలకు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని పాల్వంచ రూరల్ పోలీసులు హెచ్చరించారు. సహజ వనరుల దోపిడీకి పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

ఆదివాసులపై దాడులను అరికట్టాలి

► తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కాపుల నాగరాజు



చర్ల, నవంబర్ 17(ప్రజా జ్యోతి): ఆదివాసులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణ మే కఠిన చర్యలు చేపట్టాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కాపుల నాగరాజు డిమాండ్ చేశారు. భద్రాచలం లో సోమవారం రాత్రి ఆదివాసీ యువకుడిపై జరిగిన దాడి, హత్య ఘటన తీవ్రదిగ్భ్రాంతికిగురిచేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మం గళవారం చర్ల మండల కేంద్రంలో విడుదల చేసిన ప్రకటనలో ఆయన పలు డిమాండ్లు చేశారు.భద్రాచలం పూర్తిస్థాయి ఏజెన్సీ ప్రాంతమైనప్పటికీ గిరిజనేతరు లు ఇష్టానుసారంగా లాడ్జీలు ఏర్పాటు చేస్తూ ఆదివాసీ హక్కులు, చట్టాలను ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. లాడ్జీల పేరు తో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయని, వీటి పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. గది కోసం లాడ్జికి వెళ్లిన ఆదివాసీ యువకుడిని దారుణంగా కొట్టి హత్య చేయడం అత్యంత దురదృష్టకరమని, ఈ ఘటనకు బాధ్యులైన వారిపై హత్య కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.మృతుడి కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, సంబంధిత లాడ్జి యాజమాన్యం నుంచి మరో రూ.50 లక్షల నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. భద్రాచలంలోని ప్రతి లాడ్జికి చట్టబద్ధమైన అనుమతులు ఉన్నాయో లేదో అధికారులు సమగ్రంగా తనిఖీ చేసి, అక్రమంగా నిర్వహిస్తున్న లాడ్జీలను తక్షణమే సీజ్ చేయాలని అన్నారు. ఈ ఘటనపై సంబంధిత ఉన్నతాధికారులు, ఐఏఎస్ అధికారులు వెంటనే స్పందించాలని, ఐటీడీఏ పీఓ ప్రత్యేక చొరవ తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.అదేవిధంగా భద్రాచలంలో కొత్తగా నిర్మిస్తున్న భవనాలు, ఇతర నిర్మాణాలపై విచారణ చేపట్టి ఆదివాసీ భూములు, హక్కులు, చట్టాలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టం, పీసా చట్టాల ను పటిష్టంగా అమలు చేసినప్పుడే ఆదివాసుల హక్కులకు రక్షణ ఉంటుందని పేర్కొన్నారు.ఆదివాసుల ప్రాణాలకు, హక్కులకు రక్షణకల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఈ ఘటనలో బాధిత కుటుంబానికి తక్షణ న్యాయం చేయాలని తుడుందెబ్బ తరపున డిమాండ్ చేస్తున్నట్లు కాపుల నాగరాజు తెలిపారు.

ఏడేళ్ల నాటి విజ్ఞప్తికి నేడు ఫలితం

► పేదల బీమా కోసం గళమెత్తిన సీనియర్ జర్నలిస్టు దొడ్డా ప్రభుదాస్

► 2018, 2019లోనే ఫేస్‌బుక్ వేదికగా ప్రభుత్వానికి విజ్ఞప్తి



చర్ల, నవంబర్ 17(ప్రజా జ్యోతి): పేద కుటుంబాలకు బీమా భద్రత కల్పించాలనే లక్ష్యంతో ఏడేళ్ల క్రితమే సామాజిక మాధ్యమం వేదికగా గళమెత్తిన సీనియర్ జర్నలిస్టు దొడ్డా ప్రభుదాస్ ప్రయత్నం నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమలుకు నోచుకోవడం ఆనందంగా ఉందని ఆయన అన్నారు. 2018 అక్టోబర్ 17న, 2019 జూన్ 14న తన ఫేస్‌బుక్ ఖాతా ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన పేద కుటుంబాలకు బీమా సదుపాయం కల్పించాలని కోరుతూ ఆయన పోస్టులు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ తన పోస్టులను షేర్ చేయాలని విజ్ఞప్తి చేశారు.ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అనుకోని ఆపదలు ఎదురైనప్పుడు బీమా భరోసా ఎంతో అవసరమని, అలాంటి పరిస్థితుల్లో పేదకుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలన్నదే తన ఆకాంక్ష అని ఆయన తెలిపారు.ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పాలకుల దృష్టికి తీసుకెళ్లడంలో సామాజిక మాధ్యమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఏడేళ్ల క్రితమే పేదల బీమా అవసరాన్ని గుర్తించి తాను చేసిన విజ్ఞప్తులు నేడు కార్యరూపం దాల్చడం సంతోషంగా ఉందన్నారు. పేదలకు ఆర్థిక భద్రత కల్పించాలనే దూరదృష్టితో అప్పట్లోనే స్పందించిన జర్నలిస్టు దొడ్డా ప్రభుదాస్ ఆలోచనలు పలువురి ప్రశంసలు అందుకుంటున్నాయి.

జిల్లాలో ఘనంగా బాలల దినోత్సవం

- బాలల సంతోషమే సమాజ ప్రగతికి సూచిక
- జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్





కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 17(ప్రజాజ్యోతి) భారతదేశ తొలి ప్రధానమంత్రి దివంగత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే బాలల దినోత్సవ వేడుకలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమీకృత కలెక్టరేట్ భవనంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ వేణుగోపాల్ బాలల సమక్షంలో జ్యోతి ప్రజ్వలచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారిని కె.ఎం.తార మాట్లాడుతూ బాలల ప్రాధాన్యత, వారి హక్కులు, విద్య, ఆరోగ్యం, పోషకాహారం, సమగ్ర అభివృద్ధి, బాలల సంక్షేమం వంటి అంశాలపై కార్యక్రమంలో విస్తృతంగా చర్చించారు.ఈ చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ సభ్యులు సుమిత్ర దేవి, సాధిక్ పాషా, అంబేద్కర్ మాట్లాడుతూ బాలలే దేశ భవిష్యత్తుకు పునాదులని, నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని పేర్కొన్నారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యం, పౌష్టికాహారం, సురక్షితమైన వాతావరణం కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు, ఐసీడీఎస్, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు, పిల్లల ఎదుగుదల, పోషకాహార స్థితిగతుల మెరుగుదల వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించారు. ప్రతి చిన్నారి ఆరోగ్యంగా, ఆనందంగా, ఆత్మవిశ్వాసంతో ఎదిగేలా అవసరమైన వసతులు, అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని వివరించారు. మహిళా,శిశు,దివ్యాంగులు,వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు, ఐసీడీఎస్, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు, పిల్లల ఎదుగుదల, పోషకాహార స్థితిగతుల మెరుగుదల వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించారు. ప్రతి చిన్నారి ఆరోగ్యంగా, ఆనందంగా, ఆత్మవిశ్వాసంతో ఎదిగేలా అవసరమైన వసతులు, అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని వివరించారు. మహిళా,శిశు,దివ్యాంగులు,వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు, ఐసీడీఎస్,అంగన్వాడీకేంద్రాలద్వారా అందిస్తున్న సేవలు, పిల్లల ఎదుగుదల, పోషకాహార స్థితిగతుల మెరుగుదల వంటి అంశాలపైకూడా అవగాహన కల్పించారు. ప్రతి చిన్నారి ఆరోగ్యంగా, ఆనందంగా, ఆత్మవిశ్వాసంతో ఎదిగేలా అవసరమైన వసతులు, అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో బాలలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకర్షించాయి అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారిచే బహుమతులు ప్రధానం చేయడం చేశారు ,ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారిని హరి కుమారి, నేషనల్ న్యూట్రిషన్ మిషన్ జిల్లా సమన్వయకర్త పొనుగోటి సంపత్, జిల్లా మహిళా సాధికారికత కోఆర్డినేటర్ సంతోషి రూప, డీసీపీయు సిబ్బంది, చిల్డ్రన్ హెల్ప్ లైన్ సిబ్బంది, శిశు గృహ సిబ్బంది, జిల్లాలోని వివిధ పాఠశాలల కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

జన్ జాతీయ గౌరవ దివస్ ఉత్సవాలు



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 17,ప్రజా జ్యోతి:STమోర్చా జిల్లా అధ్యక్షురాలు భుక్యా స్వాతి ఆధ్వర్యంలో ఇల్లందులో భగవాన్ బిర్సా ముండా మరియు జన్ జాతీయ గౌరవ్ దివస్ ఉత్సవాలు.. ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయ్ చంద్ర రెడ్డి హాజరయ్యారు. విజయ్ చంద్ర రెడ్డి మాట్లాడుతూ.. బిర్సా ముండా భారతదేశ స్వాతంత్ర్య సమరయోధుడు మరియు గిరిజన నాయకుడు. 19వ శతాబ్దం చివరలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గిరిజనులను ఏకం చేసి ఆయన చేసిన పోరాటం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది అని తెలిపారు.అదేవిధంగా ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షురాలు స్వాతి మాట్లాడుతూభగవాన్ బిర్సా ముండాగిరిజన ముండా కుటుంబంలో జన్మించారు.గిరిజనుల హక్కులు మరియు సంస్కృతి కోసం ఆయన చేసిన అవిశ్రాంత కృషికి గాను ప్రజలు ఆయన్ను ధర్తీ ఆబా (భూమి తండ్రి) అని భక్తితో పిలుచుకుంటారు. సాయుధ పోరాటాన్ని నడిపించారు. మూఢనమ్మకాలను విడనాడాలని మరియు మద్యపానానికి దూరంగా ఉండాలని ఆయన గిరిజనులలో చైతన్యం తెచ్చారు. 25 ఏళ్ల చిన్న వయసులోనే ఆయన కన్నుమూశారు. ఆయన జయంతి అయిన నవంబర్ 15వ తేదీని భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం జన జాతీయ గౌరవ్ దివస్ (గిరిజన గౌరవ దినోత్సవం) గా జరుపుతోందని భూక్య స్వాతి వివరించారు. ఈ కార్యక్రమానికి బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు గోపిక్రిష్ణ , ఉపాధ్యక్షులు భుక్యా శ్రీను ,కార్యదర్శి పుణ్యా నాయక్ , ఇల్లందు పట్టణ అధ్యక్షురాలు సుచిత్ర, ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షులు గుగులోత్ గణేష్ నాయక్, గుగులోత్ రాంబాబు,గొగ్గెల కోటయ్య, తాటి వెంకటేశ్వర్లు ఇల్లందు నియోజకవర్గ మండలాల అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు ,కార్యకర్తలు ,నాయకులు తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

మాదకద్రవ్యాల మహమ్మారిని తరిమికొట్టాలి!

■ న్యాయమూర్తి బొమ్మతి భవాని

దమ్మపేట,నవంబర్. 17,(ప్రజాజ్యోతి): యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే మాదకద్రవ్యాల మహమ్మారిని సమాజం నుంచి తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్,న్యాయమూర్తి దా.బొమ్మతి భవాని సూచించారు.విద్యార్థి దశలోనే మంచి అలవాట్లను అలవర్చుకుని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.మండలపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల లో మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలన,ఎన్‌డీపీఎస్ చట్టంపై న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి దా.బొమ్మతి భవాని విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు.డ్రగ్స్ వినియోగం వల్ల శారీరక ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు మానసిక ప్రశాంతత కోల్పోయి, జీవితమే ప్రమాదంలో పడే పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. ఒక్క వ్యక్తి మాదకద్రవ్యాలకు బానిసైతే ఆ ప్రభావం అతని కుటుంబంపైనా, సమాజంపైనా పడుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత చెడు స్నేహాలకు ఆకర్షితులు కాకుండా, ఎవరైనా డ్రగ్స్ వినియోగానికి ప్రోత్సహించినా, ప్రలోభాలకు గురిచేసినా వాటికి లొంగకూడదని హితవు పలికారు.అనంతరం మాదకద్రవ్యాల నియంత్రణకు సంబంధించిన ఎన్‌డీపీఎస్ చట్టం–1985లోని నిబంధనలను వివరించారు. మాదకద్రవ్యాలను అక్రమంగా నిల్వ చేయడం, రవాణా చేయడం, విక్రయించడం, వినియోగించడం వంటి చర్యలు చట్టరీత్యా తీవ్రమైన నేరాలని స్పష్టం చేశారు. నేర స్వభావం, మాదకద్రవ్యాల పరిమాణాన్ని బట్టి కఠిన కారాగార శిక్షలు, జరిమానాలు విధించే అవకాశం ఉంటుందని వివరించారు.చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు.పాఠశాల పరిసరాల్లో లేదా సమాజంలో ఎక్కడైనా మాదకద్రవ్యాల విక్రయం, వినియోగానికి సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వాటిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లేదా పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండటమే కాకుండా, ఇతరులను కూడా వాటికి దూరంగా ఉండేలా చైతన్యపరచాలని పేర్కొన్నారు. విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలు, చట్టాలు, పౌర బాధ్యతలపై అవగాహన ఉండటం ఎంతో అవసరమని ఈ సందర్భంగా న్యాయమూర్తి పేర్కొన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం ఒక్క ప్రభుత్వానికో, పోలీసులకో పరిమితం కాదని, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజలు సమష్టిగా కృషి చేసినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంది మురళీమోహన్, ప్రధాన కార్యదర్శి లక్కినేని నరేంద్ర బాబు,న్యాయవాదులు గొల్ల భవాని కృష్ణయాదవ్,నల్లపు ఉదయ్,తమ బలరాజు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

